క్లుప్తంగా

తపస్ క్యాలెండర్ ఆవిష్కరణ



వనపర్తి విద్యావిభాగం: తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నూనత సంవత్సర క్యాలెండర్‌ను మంగళవారం డీఈవో అబ్దుల్‌ఘని తపస్ నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు వేముల అమరేందర్‌రెడ్డి, తపస్ ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్, తపస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వరప్రసాద్‌గౌడ్, శశివర్ధన్, మల్లేష్ యాదవ్, రాములు, ప్రభాకర్, ఈశ్వర్, అరవిందర్‌రెడ్డి, తిరుపతయ్య, ఈశ్వర్, రాకేష్‌రెడ్డి, కురుమూర్తి, రవికుమార్, అక్షయ్‌కుమార్, రాంరెడ్డి మొదలగు వారు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి

పాన్‌గల్: విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని దానికి అనుగుణంగా చదువుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా విద్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కస్తూర్బా విద్యాలయంలోని బోధన సిబ్బంది సమ్మె కారణంగా బాలికలు ఒత్తిడికి గురవుతున్న తరుణంలో వారిలో ఉత్సాహం నింపేందుకు క్రీడా పోటీలు, సబ్జెక్టు అంశాలపై క్విజ్, పాటలు, డ్యాన్స్ వంటి పోటీలను నిర్వహించినట్లు ఆయన పేర్కొన్నారు.

రెండోరోజు నిలిచిన బ్యాంకు సేవలు



అమరచింత: మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్‌లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడిన ఘటనలో మంగళవారం బ్యాంకు సేవలను నిలిపివేస్తూ సీసీ కెమెరాల మరమ్మతు పనులు చేపట్టారు. ఈమేరకు యూనియన్ బ్యాంక్ జోనల్ కార్యాలయం నుంచి వచ్చిన సిబ్బంది సీసీ కెమెరాల వైరింగ్‌తో పాటు మరమ్మతు పనులు చేపట్టినట్లు బ్యాంక్ మేనేజర్ శివశంకర్ తెలిపారు.

పడిపూజకు ఆహ్వానం

అమరచింత: పట్టణంలో జనవరి 3న జరిగే శ్రీఅయ్యప్పస్వామి మహాపడి పూజకు హాజరు కావాలని డాక్టర్ ఆదిత్య పరాశ్రీ గురువును ఆహ్వానించినట్లు గురుస్వాములు తెలిపారు. స్వామివారి పూజలో పాల్గొని భక్తులకు ప్రవచనాలను వివరించి, ఆధ్యాత్మిక భావం కలిగించాలంటూ ఆహ్వాన పత్రికను అందించారు. కార్యక్రమంలో గురుస్వాములు క్యామ భాస్కర్, మేర్వ రాజు, నరాల సిద్ధురాములు, మేర్వ అనిల్, విజయ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

2 బైక్‌లు ఢీ: ఇద్దరికి గాయాలు

వనపర్తి రూరల్: రెండు బైకులు ఢీకోవడంతో ఇద్దరికి గాయాలయిన ఘటన మంగళవారం వనపర్తి పట్టణంలోని బాలానగర్ వద్ద చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... పట్టణంలోని తెలుగువాడకు చెందిన గోకం రాజేష్, గోకం బాలచంద్రయ్య బైక్‌లపై వస్తూ పట్టణంలోని బాలానగర్ టీ బ్రేక్ వద్ద ఒకరినొకరు ఢీకొట్టుకోవడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని స్థానికులు అంబులెన్స్‌లో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తరలించి, చికిత్స అందిస్తున్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలు ప్రారంభం



బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారి పల్లకీసేవ

- భక్తిశ్రద్ధలతో స్వామివారి ఊరేగింపు
- మల్లాపురం గ్రామానికి వేలాదిగా తరలిరానున్న భక్తులు



స్వామివారి ఉత్సవ విగ్రహాలు

ఆత్మకూర్: పట్టణ శివారులోని మల్లాపురం ప్రముఖ వేదపండితులు వెంకటశేషశర్మ, సుబ్రమణ్యస్వామిల ఆధ్వర్యంలో వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పురవీధుల గుండా వేలాది మంది భక్తుల కోలాటం, భజనలతో ఉత్సవ మూర్తుల విగ్రహాలకు పల్లకీసేవ నిర్వహించారు. వారం రోజుల పాటు జరిగే కార్యక్రమాలకు వేలాదిగా భక్తులు హాజరు కానున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని నిర్వాహకులు తెలిపారు.

ప్రత్యేక పూజలు

జనవరి 1 నుంచి దేవత ఆవాహనం, విశ్వక్సేన, పుణ్యాహవాచం, అంకురార్పణ, కళశస్థాపన, దిక్పాలక పూజ, గణపతి హోమం, 2వ తేదీన స్వామివారికి అష్టోత్తర కలశాలతో మహాస్నానం, అర్చన, నత్యహోమం, 3న సుదర్శణ హోమం, లక్ష్మీహోమం, గుడాజ్యోతి, మహిళా భక్తులచే శ్రీలక్ష్మీనారసింహస్వామికి అభిశేఖం, వేదపారాయణం, 4న స్వామివారికి కల్యాణోత్సవం, రథోత్సవం, 5న చక్రస్నానం, సుబ్రమణ్య, అయ్యప్ప మూర్తులకు అభిషేకం, పుష్పయాగం, మంగళశాసనం, ధ్వజావరోహణ, స్వస్తి వాచకం, కర్తలకు శేషవస్త్రాలతో వేదాశీస్సులు తదితర పూజ కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

విద్యుత్ రంగాన్ని కాపాడుదాం



నిరసన వ్యక్తం చేస్తున్న సీఐటీయూ నాయకులు

కొత్తకోట: కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాల్లో స్మార్ట్ మీటర్లు నెలకొల్పడం ద్వారా విద్యుత్ రంగాన్ని దొడ్డిదారిన ప్రైవేటీకరించే ప్రయత్నాలు చేస్తుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ అన్నారు. మంగళవారం కొత్తకోట చౌరస్తాలో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా బొబ్బిలి నిక్సన్ మాట్లాడుతూ విద్యుత్ కార్మికులు, ఇంజనీర్లు కలిసి ఐక్య పోరాటానికి అండగా నిలబడాలని సంఘీభావం వ్యక్తం చేశారు. స్మార్ట్ మీటర్లు మొదలు అన్ని కాంట్రాక్టులు కేంద్ర ప్రభుత్వం లంచాలు పుచ్చుకొని అదానీకే అంటకడుతున్న ఆరోపణలు వెలుగులోకి వచ్చాయని ఆయన ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో చెన్నకేశవరెడ్డి, శ్యామ్, కె.వెంకటయ్య, నెల్లూరు కురుమన్న, ఎం.కురుమన్న, యాదయ్య, బాలస్వామి, నర్సింహులు వెంకటన్న, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే వ్యాధులు దూరం



అమరచింతలో వృద్ధురాలికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్

అమరచింత: వయస్సుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ గుండె సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారని, ప్రజలు అప్రమత్తంగా ఉండి వైద్య సేవలు పొందాలని మహబూబ్‌నగర్‌కు చెందిన ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణయ్ అన్నారు. మంగళవారం దేశాయి ప్రకాష్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పట్టణంలో నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన పాల్గొని రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ చేతుల మీదుగా డీఎంఆర్‌ఎం ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేసినట్లు దేశాయి ప్రకాష్‌రెడ్డి సేవా సంస్థ అధ్యక్షుడు కలాంపాషా తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి, మార్కెట్ మాజీ చైర్మన్ ఎస్‌ఏ రాజు, డీఎంఆర్‌ఎం ట్రస్టు సభ్యురాలు సౌజన్యరెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా ఉపాధ్యక్షుడు శ్యాం, వెంకట్‌రెడ్డి, వైద్యులు డాక్టర్ సన్ని, డాక్టర్ రోహిణి, కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

ఆత్మకూర్: మాజీ అడ్వకేట్ జనరల్ దేశాయి ప్రకాష్‌రెడ్డి జన్మదినం సందర్భంగా మంగళవారం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ నిర్వాహకులు సయ్యద్‌కలాంపాష, ఫయాజ్, సర్దార్, ఖాజమైనోద్దీన్, ఇబ్రహీం, దాసు, జములన్న, వెంకటన్న, శ్రీనివాసులు ఉన్నారు.

పుట్ట గొడుగుల పెంపకంతో లాభాలు

పాన్‌గల్: పుట్ట గొడుగుల పెంపకంతో మంచి లాభాలు ఉన్నాయని, వీటి పెంపకంపై రైతులు దృష్టి సారించాలని మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి రైతులకు సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నిర్వహించిన రైతు నేస్తంలో పుట్ట గొడుగుల పెంపకంపై రైతులకు శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. వీటి పెంపకంతో ఆదాయం, తిన్న వారికి పౌష్టికాహారం లభిస్తుందని, చాలా తక్కువ పెట్టుబడితో వీటిని పెంచొచ్చన్నారు. దీంతో పాటు యాసంగి సాగులో విత్తనాలు, ఎరువుల ఎంపిక సాగు విధానంపై శాస్త్రవేత్తలు పలు సూచనలు, సలహాలను అందించారు. చలి తీవ్రత అధికంగా ఉన్నందున వరి నాడుమలు పోసిన రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

అందుబాటులో వరి విత్తనాలు

పాన్‌గల్: మండల కేంద్రంలోని రైతువేదికలో సబ్సిడీ వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి రాజవర్ధన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ ఆహార భద్రత పథకం ద్వారా రైతు శిక్షణ కోసం వరి ఎంటీయూ 1010 రకం, కేఎన్‌ఎం 1638 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంటీయూ 1010 రకం 25 కేజీల బస్తా సబ్సిడీ పోను రూ.745, కేఎన్‌ఎం 1638 రకం 15 కేజీల బస్తా రూ.303 చెల్లించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ, చిన్నకారు రైతులు ఏఈఓలను సంప్రదించి విత్తనాలు పొందాలని కోరారు.

కొత్త సంవత్సరం.. కోటి వెలుగులు



వీపనగండ్లలోని సమైక్య కార్యాలయంలో కేక్‌కట్ చేస్తున్న ఉద్యోగులు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని మహిళా సమైక్య కార్యాలయంలో సిబ్బందితో పాటు పలువురు మహిళలు కొత్త సంవత్సర వేడుకలను పురస్కరించుకొని ముందస్తుగా మంగళవారం సంబురాలు చేసుకున్నారు. మహిళలు నూతన సంవత్సరంలో ఆర్థికంగా బలపడాలని, అందుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధుల సహకారాన్ని తీసుకుంటామని మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు శాంతమ్మ అన్నారు. కార్యక్రమంలో ఏపీఎం బిచ్చన్న, సీసీలు వీరయ్య, మాధవరావు, పలువురు బుక్ కీపర్లు పాల్గొన్నారు.

హంగామా

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని స్వీట్ హౌజ్‌ల్లో కేక్‌ల కోసం వచ్చే యువతతో కోలాహలంగా మారింది. కొందరు దుకాణాదారులు ప్రత్యేకంగా టెంట్లు వేసి కేక్‌లు విక్రయిస్తున్నారు. కేక్‌లతో పాటుగా బాణాసంచా తదితర వాటిని కొంటూ యువత ఉత్సాహంగా గడిపారు. మంగళవారం అర్ధరాత్రి దాటిన వెంటనే బాణసంచా కాల్చి, కేక్‌లు కట్ చేసి 2025 కొత్త సంవత్సరం శుభాకాంక్షలు చెప్పుకొన్నారు.



ఖిల్లాఘనపురంలో..



అమరచింతలో..



ఆత్మకూర్‌లోని ఎంబీ చర్చిలో..



వనపర్తిలో..

సిబ్బందికి అలవెన్స్ అందజేత

వనపర్తి: గడిచిన అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల విధులు నిర్వహించిన రెవెన్యూయేతర శాఖల సిబ్బందికి ఇచ్చిన అలవెన్స్‌లో కోత విధించినట్లు రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు, రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికి ఫిర్యాదులు అందినట్లు ఈనెల నెల 29న సాక్షిలో 'కలెక్టరేట్ ఏఓపై ఫిర్యాదు' అనే శీర్షికన ప్రచురించిన వార్తా కథనానికి అధికారులు స్పందించారు. మంగళవారం రెవెన్యూయేతర సిబ్బంది కొందరికి అలవెన్స్ బ్యాలెన్స్ డబ్బులను పిలిపించి అందజేశారు. ఈ విషయం కలెక్టరేట్‌లోని రెవెన్యూ, రెవెన్యూయేతర శాఖలలో పనిచేసే అధికారులు, సిబ్బంది చర్చించుకున్నారు. ఈ విషయంపై మరికొందరు రెవెన్యూయేతర సిబ్బంది అసంతృప్తితో ఉన్నట్లు తెలుస్తోంది. ఉన్నతాధికారులు ఈ విషయంపై స్పందించి సమగ్ర విచారణ చేస్తే.. మరికొన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

కూచిపూడి నృత్యంలో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఉపాధ్యాయ బృందం

కొత్తకోట రూరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కూచిపూడి గ్రామంలో కూచిపూడి హెరిటేజ్ సొసైటీ వారు నిర్వహించిన కూచిపూడి విశ్వ నర్తనంలో పట్టణంలోని కేపీఎస్ స్కూల్‌కు చెందిన విద్యార్థినులు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి, సర్టిఫికెట్లు సాధించినట్లు ప్రిన్సిపాల్ కృష్ణవేణి తెలిపారు. కూచిపూడి న్యాటంలో దాదాపు మూడు వేల మంది పాల్గొనగా కేపీఎస్ స్కూల్‌కు చెందిన 12మంది విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించారు. పాఠశాల విద్యార్థులు కూచిపూడి నాట్యంలో ప్రదర్శన చాటేందుకు కృషి చేసిన కూచిపూడి టీచర్ సుచరితను విద్యార్థినులను మంగళవారం పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయ బృందం అభినందించారు.

వీఆర్‌ఏలను ఆదుకోవాలని వినతి

అమరచింత: 55 ఏళ్ల నుంచి 61 ఏళ్లలోపు వయస్సు గల వీఆర్‌ఏలను ప్రభుత్వం ఆదుకోవాలని స్థానిక ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి శనివారం వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా వీఆర్‌ఏలు మాట్లాడుతూ గత ప్రభుత్వం వీఆర్‌ఏలకు పేస్కేల్ అమలు చేస్తూ వీఆర్‌ఏలను ఇతర శాఖల్లో సర్దుబాటు కోసం విడుదల చేసిన జీఓ ఎంఎస్ నంబర్ 81 వల్ల రాష్ట్రంలో 2,500 మంది వీఆర్‌ఏ కుటుంబాలకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. వీఆర్‌ఏల సమస్యను సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హామీ ఇచ్చారు. వీఆర్‌ఏలు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వీఆర్‌ఏలు కావలిభీమ్ అర్జున్, కుమార్, నరసింహ, నాగరాజు, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయాలి

వనపర్తి విద్యావిభాగం: జిల్లా కేంద్రంలో విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్న కృష్ణవేణి హై స్కూల్ యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎస్ఎఫ్, బీజీబీఎస్, బీసీ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఇందిరాపార్క్ సమీపంలో గల కృష్ణవేణి హై స్కూల్ యాజమాన్యం నిర్వహణ నిర్లక్ష్యం కారణంగా నేడు మున్సిపల్ అధికారులు స్కూల్‌ను సీజ్ చేశారన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి చిట్యాల రాము, పట్టణ అధ్యక్షుడు రవిగౌడ్, అరుణ్‌నాయక్ తదితరులు ఉన్నారు.